APTEL/26/A4269

# అనంత సూర్య

www.ananthasurya.com తెలుగువార్త

ప్రచురణ : అనంతపురం / శ్రీ సత్యసాయి ఎడిటర్ : సి హరికృష్ణ శుక్రవారం 07 ఆగస్టు 2026 సంపుటి: 01 సంచిక :71 పేజీలు : 04 వెల: 2-00/-



## రష్యాపై భారీ డ్రోన్ దాడి

- యరోస్లావిల్ ఆయిల్ రిఫైనరీపై ఉక్రెయిన్ లక్ష్యదాడి
- 605 డ్రోన్లను కూల్చివేసినట్లు రష్యా ప్రకటన
- రష్యా ప్రతిదాడిలో ముగ్గురు మృతి, 12 మందికి గాయాలు
- యుద్ధం మరింత ఉధృతమవుతున్న సంకేతాలు

మాస్కో, ఆగస్టు 6 : రష్యా--ఉక్రెయిన్ యుద్ధం మరోసారి తీవ్రరూపం దాల్చింది. భారీ సంఖ్యలో డ్రోన్లతో ఉక్రెయిన్ రష్యాపై దాడులకు పాల్పడింది. ముఖ్యంగా యరోస్లావిల్ నగరంలోని కీలక ఆయిల్ రిఫైనరీని లక్ష్యంగా చేసుకుని దాడి జరగడంతో అక్కడ భారీ పేలుళ్లు సంభవించాయి. రిఫైనరీ నుంచి దట్టమైన నల్లటి పొగలు ఆకాశాన్ని కమ్మేయడంతో స్థానికుల్లో భయాందోళనలు నెలకొన్నాయి. ఇటీవలి కాలంలో తమ నగరంపై జరిగిన అతిపెద్ద డ్రోన్ దాడి ఇదేనని యరోస్లావిల్ గవర్నర్ మిఖాయిల్ ఎవ్రేవ్ తెలిపారు. ఈ దాడిలో మొత్తం 605 డ్రోన్లను ఉక్రెయిన్ ప్రయోగించిందని, వాటిలో 92 డ్రోన్లను యరోస్లావిల్ ప్రాంతంలోనే రష్యా వైమానిక రక్షణ వ్యవస్థ కూల్చివేసిందని అధికారులు వెల్లడించారు. మాస్కోతో పాటు నల్ల సముద్ర తీర ప్రాంతాలు, పలు ఇతర ప్రాంతాలు కూడా డ్రోన్ దాడుల లక్ష్యంగా మారినట్లు పేర్కొన్నారు. అత్యాధునిక వైమానిక రక్షణ వ్యవస్థలను ఉపయోగించి పెద్ద ఎత్తున డ్రోన్లను అడ్డుకున్నామని రష్యా ప్రకటించింది. దాడికి గురైన స్లావ్‌నెఫ్ట్-యానోస్ ఆయిల్ రిఫైనరీ రష్యాలోని అతిపెద్ద ఐదు రిఫైనరీల్లో ఒకటిగా గుర్తింపు పొందింది. ప్రతి ఏడాది సుమారు 15 మిలియన్ టన్నుల ముడి చమురును శుద్ధి చేసే సామర్థ్యం ఈ కేంద్రానికి ఉంది. కార్లు, విమానాలు, పరిశ్రమలకు అవసరమైన ఇంధన ఉత్పత్తిలో ఈ రిఫైనరీ కీలక పాత్ర పోషిస్తోంది.

## మంత్రివర్గంలో కీలక నిర్ణయాలు




అమరావతి, ఆగస్టు 6 : ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన గురువారం జరిగిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన పలు కీలక నిర్ణయాలపై సమగ్రంగా చర్చించి ఆమోదం తెలిపారు. ప్రజా సంక్షేమం, మౌలిక వసతుల అభివృద్ధి, మహిళల భద్రత, రైతు సంక్షేమం వంటి అంశాలకు సమావేశంలో ప్రాధాన్యం ఇచ్చారు. సమావేశంలో అమరావతి రాజధాని నిర్మాణ పనులను మరింత వేగవంతం చేయడం, పేదలకు గృహాల నిర్మాణం, కొత్త పట్టణాభివృద్ధి సంస్థల ఏర్పాటు, పాదచారుల భద్రతకు సంబంధించిన ప్రతిపాదనలను మంత్రివర్గం ఆమోదించింది. రాష్ట్ర అభివృద్ధిని వేగవంతం చేసే నిర్ణయాలపై విస్తృతంగా చర్చించినట్లు వెల్లడించారు. ఆక్వా రైతులకు ప్రస్తుతం అమల్లో ఉన్న రాయితీ విద్యుత్‌ను కొనసాగించేందుకు కూడా మంత్రివర్గం అంగీకారం తెలిపింది. వ్యవసాయ, మత్స్య రంగాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, రైతుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు పేర్కొన్నారు. మహిళలు, చిన్నారుల భద్రతను మరింత బలోపేతం చేసే లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్ దిశా చట్ట సవరణలపై కూడా సమావేశంలో చర్చించారు. మహిళల రక్షణకు అవసరమైన చట్టపరమైన మార్పులు తీసుకురావడంపై మంత్రివర్గం అభిప్రాయాలు పంచుకుంది. రాష్ట్రంలో సమర్థ పాలన, వేగవంతమైన అభివృద్ధి, ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదల కోసం ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని సమావేశంలో స్పష్టం చేశారు. ప్రజా ప్రయోజనాలే ప్రభుత్వ నిర్ణయాలకు ప్రధాన ఆధారమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో మరింత ముందుకు తీసుకెళ్లడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రివర్గ సభ్యులు తెలిపారు. ప్రజా సంక్షేమం, భద్రత, మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తూ పనిచేస్తోందని వెల్లడించారు.

## అంబటి రాంబాబుపై మరో కేసు

**గుంటూరులో మాజీ మంత్రిపై పోలీసు కేసు నమోదు**

**కేంద్ర మంత్రి పెమ్మసానిపై తప్పుడు ప్రచారమని ఫిర్యాదు**

**కృత్రిమ మేధతో రూపొందించిన వీడియోలపై ఆరోపణలు**

**మంగళగిరి సీఐడీ కేసు తర్వాత మరో కేసు నమోదు**



గుంటూరు, ఆగస్టు 6 : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబుపై మరో పోలీసు కేసు నమోదైంది. కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌ను లక్ష్యంగా చేసుకుని సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం నిర్వహించారని ఆరోపిస్తూ తెలుగుదేశం పార్టీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు పిల్లి మాణిక్యరావు అరండల్‌పేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం, రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న కేంద్ర మంత్రి ప్రతిష్టకు భంగం కలిగించేలా అసత్య ప్రచారం చేశారని ఆరోపించారు. రాజకీయ విద్వేషాలను రెచ్చగొట్టే విధంగా, ప్రజల్లో అపోహలు కలిగించే ఉద్దేశంతో కృత్రిమ మేధ సాయంతో రూపొందించిన వీడియోలను సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేశారని ఫిర్యాదుదారు పేర్కొన్నారు.

## పోలీస్ ఉద్యోగాలపై జగన్‌కు వినతి



తాడేపల్లి, ఆగస్టు 6 : రాష్ట్రంలో ఖాళీగా ఉన్న పోలీసు ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ విద్యార్థి, నిరుద్యోగ, యువజన జేఏసీ ప్రతినిధులు గురువారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. రాష్ట్రంలో వేలాది మంది నిరుద్యోగ యువత పోలీసు నియామకాల కోసం ఎదురుచూస్తున్నారని, ప్రభుత్వం తక్షణమే నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరారు. ఏపీఎస్‌యూ జేఏసీ కన్వీనర్ ఎంబేటి రామచంద్ర ఆధ్వర్యంలోని ప్రతినిధి బృందం మాట్లాడుతూ, పోలీసు శాఖలో సుమారు 20 వేల ఖాళీలు ఉన్నాయని, అందులో కనీసం 10 వేల పోస్టులైనా వెంటనే భర్తీ చేయాలని ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని జగన్‌ను కోరింది. అలాగే పోలీసు ఉద్యోగాలకు సిద్ధమవుతున్న అభ్యర్థుల వయోపరిమితిని ప్రస్తుతం ఉన్న పరిమితి నుంచి 35 సంవత్సరాలకు పెంచేలా ప్రభుత్వాన్ని డిమాండ్ చేయాలని విజ్ఞప్తి చేసింది. రాష్ట్రంలోని లక్షలాది మంది యువత ఎన్నో సంవత్సరాలుగా పోలీసు ఉద్యోగాల కోసం శిక్షణ పొందుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని జేఏసీ ప్రతినిధులు తెలిపారు. 2022 తర్వాత పోలీసు నియామకాల నోటిఫికేషన్ విడుదల కాకపోవడంతో వేలాది మంది అభ్యర్థులు వయోపరిమితి కోల్పోయే పరిస్థితి నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆలస్యం చేసిన కారణంగా అభ్యర్థులు నష్టపోకుండా వయోపరిమితిని 35 సంవత్సరాలకు పెంచాలని కోరారు. పోలీసు శాఖలో భారీ సంఖ్యలో ఖాళీలు ఉన్నప్పటికీ వాటిని భర్తీ చేయకపోవడం వల్ల ఒకవైపు నిరుద్యోగ యువత అవకాశాలు కోల్పోతుండగా, మరోవైపు పోలీసు శాఖలో సిబ్బంది కొరత కొనసాగుతోందని ప్రతినిధులు పేర్కొన్నారు. అందువల్ల తక్షణమే నియామక ప్రక్రియ ప్రారంభించి కనీసం 10 వేల పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు.



## క్రోచెట్ కళాకారులకు అండగా పవన్

అమరావతి, ఆగస్టు 6 : క్రోచెట్ లేస్ కళాకారుల ఆరోగ్య సమస్యలను గుర్తించిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ వారి దృష్టి లోపాల నివారణకు చర్యలు చేపట్టారు. గంటల తరబడి సూక్ష్మమైన అల్లికలు చేస్తూ చూపు సమస్యలు ఎదుర్కొంటున్న కళాకారులకు ఉచితంగా కళ్లజోళ్లు అందజేయాలని ఆదేశించగా, తొలి దశలో 141 మంది కళాకారులకు కళ్లజోళ్లు సిద్ధం చేసి పంపిణీ చేశారు. గత నెల విజయవాడలో నిర్వహించిన హస్తకళా మహోత్సవ ప్రారంభోత్సవంలో కళాకారులతో మాట్లాడిన పవన్ కళ్యాణ్‌కు నరసాపురం నియోజకవర్గంలోని పసలదీవికి చెందిన క్రోచెట్ లేస్ కళాకారిణి మహాలక్ష్మి తమ వృత్తి కారణంగా చూపు మందగిస్తోందని వివరించారు. దీనిపై వెంటనే స్పందించిన ఉప ముఖ్యమంత్రి రాష్ట్రవ్యాప్తంగా హస్తకళాకారుల కోసం క్లస్టర్ల వారీగా ఉచిత నేత్ర వైద్య శిబిరాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఆదేశాల మేరకు నరసాపురంలో నిర్వహించిన తొలి నేత్ర వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహించగా, 141 మందికి కళ్లజోళ్లు అవసరమని వైద్యులు గుర్తించారు. దీంతో వారికి ఉచితంగా కళ్లజోళ్లు అందించే ఏర్పాట్లు పూర్తిచేశారు. కళాకారులు ఆరోగ్యంగా ఉంటేనే వారి జీవనోపాధి మరింత మెరుగుపడుతుందని అధికారులు తెలిపారు. ఇప్పటికే పాలకొల్లు పరిధిలోని యలమంచిలి, అత్తిలిలో మరో రెండు నేత్ర వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ శిబిరాల్లో కూడా దృష్టి లోపాలు ఉన్న మరో 350 మంది కళాకారులను గుర్తించి వారికి కళ్లజోళ్లు అందించే ప్రక్రియ కొనసాగుతోంది. అలాగే 20 మందికి పైగా కంటిశుక్లం సమస్య ఉన్నట్లు వైద్యులు గుర్తించగా, వారికి శస్త్రచికిత్సలు నిర్వహించేందుకు చర్యలు చేపట్టారు.

# ఓబులదేవరచెరువు మండలంలో బీజేపీ మండల కార్యవర్గ సమావేశం
## – పలువురు పార్టీలో చేరిక

ఓబులదేవరచెరువు: భారతీయ జనతా పార్టీ ఓబులదేవరచెరువు మండల శాఖ ఆధ్వర్యంలో మండల అధ్యక్షులు శ్రీ వీరాంజనేయులు అధ్యక్షతన మండల కార్యవర్గ సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి శ్రీ చింత శ-రత్ కుమార్ రెడ్డి హాజరై పార్టీ బలోపేతం, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు మరియు భవిష్యత్ కార్యాచరణపై కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా



ఓబులదేవరచెరువు మండలం వేమారెడ్డిపల్లి గ్రామానికి చెందిన శ్రీ రంగారెడ్డి, శ్రీ సోమశేఖర్ భారతీయ జనతా పార్టీ సిద్ధాంతాలు, ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలోని సుపరిపాలనకు ఆకర్షితులై బీజేపీలో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం శ్రీ సత్యసాయి జిల్లా ప్రధాన కార్యదర్శిహాతిరవేటి నరేష్ బాబు, సీనియర్ నాయకులు సి.రంగారెడ్డి,అశ్వత్తప్ప, మండల ప్రధాన కార్యదర్శి సురేష్, ఆకుతోటపల్లి కిష్టప్ప,నాగప్ప,జగదీష్,వేంకటశివ, ఆర్. లక్ష్మీనారాయణ, ఈ.ఓబులేసు, ఆర్.నరసింహులు తదితర పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# 10లోపు వివరాలు నమోదు చేసుకోవాలి

చిత్తూరు,ఆగస్టు 6(అనంత సూర్య): ప్రస్తుత సీజన్‌లో తోతాపురి మామిడి ధరలు తగ్గుముఖం పట్టడంతో రైతులకు ఊరట కల్పించేందుకు ప్రభుత్వం టన్నుకు రూ.4,000 మద్దతు ధర ప్రకటించినట్లు జిల్లా ఉద్యానాధికారి సతీష్ తెలిపారు.జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు చిత్తూరు జిల్లాలోని తోతాపురి మామిడి రైతులందరూ తమ వివరాలను ఈ నెల 10వ తేదీలోపు సమీప రైతు సేవా కేంద్రాల్లో ధ్రువీకరించుకోవాలని ఆయన గురువారం ఒక ప్రకటనలో కోరారు.రైతులు తమ పేరు, ఆధార్ నంబర్, విక్రయించిన మామిడి టన్నుల వివరాలు, బ్యాంకు ఖాతా వివరాలు, ఈ-పంట నమోదు వివరాలు సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. అలాగే ఆధార్ కార్డు, బ్యాంకు పాస్‌బుక్, భూమి పట్టాదారు పాస్‌బుక్ జిరాక్స్ ప్రతులను వెంట తీసుకురావాలని సూచించారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ప్రయోజనం పొందేందుకు అర్హులైన రైతులందరూ నిర్ణీత గడువులోగా తమ వివరాలను నమోదు చేసుకోవాలని జిల్లా ఉద్యానాధికారి సతీష్ విజ్ఞప్తి చేశారు.

# తొలి దశలో 730 ఇళ్ల నిర్మాణం
## మౌలిక వసతులు త్వరితగతిన పూర్తి చేయాలి

చిత్తూరు,ఆగస్టు 6(అనంత సూర్య): చిత్తూరు పట్టణానికి సమీపంలోని అనుపల్లి హౌసింగ్ లేఅవుట్‌లో తొలి దశ (ఎన్‌పీఐ ఫేజ్--1)లో 730 గృహాల నిర్మాణానికి చర్యలు చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. గురువారం అనుపల్లి హౌసింగ్ లేఅవుట్‌ను పరిశీలించిన కలెక్టర్, మొత్తం 2,390 ప్లాట్లు ఉన్న ఈ లేఅవుట్‌లో తొలి దశలో 730 ఇళ్ల నిర్మాణానికి ప్రణాళిక సిద్ధం చేసినట్లు చెప్పారు. చిత్తూరు పట్టణానికి సుమారు ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ ప్రాంతాన్ని అన్ని మౌలిక సదుపాయాలతో అభివృద్ధి చేస్తున్నట్లు పేర్కొన్నారు. తొలి దశలో ఓసీ -- 109, బీసీ -- 425, ఎస్సీ -- 183, ఎస్టీ -- 13 మంది లబ్ధిదారులకు గృహాలు కేటాయించినట్లు కలెక్టర్ వెల్లడించారు. లేఅవుట్‌లో మున్సిపల్ కార్పొరేషన్



ఆధ్వర్యంలో బోర్‌వెల్ ద్వారా తాగునీటి సౌకర్యం, విద్యుత్ సౌకర్యం ఇప్పటికే అందుబాటులో ఉన్నాయని తెలిపారు. గ్రావెల్ రోడ్ల నిర్మాణం ఇంకా పూర్తి కాలేదని, మిగిలిన మౌలిక వసతులను వేగంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. లబ్ధిదారులకు నాణ్యమైన గృహాలతో పాటు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, పనులను నిర్ణీత గడువులో పూర్తి చేసేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు.
ఈ సందర్భంగా అనుపల్లి హౌసింగ్ కాలనీ సమీపంలో ప్రతిపాదిత ఎన్‌టీఆర్ హౌసింగ్ కాలనీ నిర్మాణానికి స్థలాన్ని కూడా జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ నెల 24వ తేదీలోపు ఇల్లు లేని నిరుపేదల జాబితాను సిద్ధం చేసి, అర్హులైన లబ్ధిదారులకు నివాస ధ్రువపత్రాలు అందజేయనున్నట్లు ఆయన తెలిపారు.
ఈ కార్యక్రమంలో చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, సీకే లావణ్య, హౌసింగ్ పీడీ సుబ్రహ్మణ్యం, డీఈ శ్రీధర్, తహసీల్దార్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# నేడు జాతీయ చేనేత దినోత్సవం

చిత్తూరు,ఆగస్టు6 (అనంత సూర్య): దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో చేనేత రంగం పోషించిన విశిష్ట పా-త్రను స్మరించుకుంటూ నేడు జాతీయ చేనేత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు జిల్లా చేనేత, జౌళి శాఖ సహాయ సంచాలకులు పి. విజయ్ నంద్ తెలిపారు.1905లో విదేశీ వస్త్రాలను బహిష్కరిస్తూ స్వదేశీ వస్త్రాలను ప్రోత్సహించే ఉద్దేశంతో ప్రారంభమైన స్వదేశీ ఉద్యమాన్ని గుర్తు చేసుకుంటూ, 2015లో కేంద్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం ఆగస్టు 7ను జాతీయ చేనేత దినోత్సవంగా ప్రకటించిన విషయాన్ని ఆయన వివరించారు.ఈ సందర్భంగా ఉదయం 9.30 గంటలకు చిత్తూరు కలెక్టరేట్ ఆవరణలో ప్రత్యేక చేనేత వస్త్ర ప్రదర్శన స్టాల్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. జిల్లాలో ప్రస్తుతం 10 చేనేత సహకార సంఘాలు కార్యకలాపాలు నిర్వహిస్తూ చేనేత కార్మికులకు వివిధ సేవలు అందిస్తున్నాయని చెప్పారు. అలాగే 1,223 మంది చేనేత కార్మికులు ప్రభుత్వ పింఛన్లు పొందుతూ సంక్షేమ పథకాల ప్రయోజనాలు పొందుతున్నారని పేర్కొన్నారు. చేనేత, మరమగ్గాల రంగాల అభివృద్ధి కోసం ప్రభుత్వం విద్యుత్ సబ్సిడీతో పాటు పలు ప్రోత్సాహక పథకాలను అమలు చేస్తోందన్నారు. ప్రస్తుతం జిల్లాలో 249 చేనేత మగ్గాలు, 2,897 మరమగ్గాలు (పవర్‌లూమ్స్) పనిచేస్తున్నాయని తెలిపారు. చేనేత కార్మికుల జీవనోపాధి మెరుగుపడేలా, సంప్రదాయ వస్త్ర పరిశ్రమను బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం వివిధ సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని జిల్లా చేనేత, జౌళి శాఖ సహాయ సంచాలకులు పి. విజయ్ నంద్ వెల్లడించారు.

# "మెగా డీఎస్సీపై వైసీపీ విష ప్రచారం"

చిత్తూరు,ఆగస్టు 6(అనంత సూర్య): మెగా డీఎస్సీ--2025 నియామకాలపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు చేస్తున్న ఆరోపణలు పూర్తిగా నిరాధారమని, అత్యంత పారదర్శకంగా నిర్వహించిన పరీక్షలపై కావాలనే విష ప్రచారం చేస్తున్నారని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ విమర్శించారు. వైసీపీ నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలను ఖండిస్తూ గురువారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజాదర్బార్‌లో డీఎస్సీలో ఎంపికైన ఉపాధ్యాయులతో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఎన్నికల హామీ మేరకు కూటమి ప్రభుత్వం మెగా డీఎస్సీ ద్వారా 16,347 ఉపాధ్యాయ పోస్టులను పారదర్శకంగా భర్తీ చేసిందన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడమే కాకుండా, పరిశ్రమలను తీసుకొచ్చి ఉపాధి అవకాశాలు కూడా విస్తరిస్తున్నారని పేర్కొన్నారు.మంత్రి నారా లోకేష్‌కు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో వస్తున్న గుర్తింపును తట్టుకోలేకే వైసీపీ నాయకులు డీఎస్సీపై అసత్య



ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. గత ఐదేళ్ల పాలనలో ఒక్క ఉపాధ్యాయ పోస్టు కూడా భర్తీ చేయని వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం, ఇప్పుడు డీఎస్సీపై ఆరోపణలు చేయడం విడ్డూరమన్నారు. డీఎస్సీలో అక్రమాలు జరిగాయని సీబీఐ విచారణ కోరుతూ దాఖలైన ప్రజాహిత వ్యాజ్యాన్ని హైకోర్టు కొట్టివేసిందని గుర్తు చేసిన ఎమ్మెల్యే, పరీక్ష రాసిన అభ్యర్థుల నుంచి ఎలాంటి ఫిర్యాదులు లేకపోయినా వైసీపీ రాజకీయ ప్రయోజనాల కోసం ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు.
వైసీపీ చేస్తున్న తప్పుడు ప్రచారం వల్ల ఉద్యోగాలు సాధించిన వేలాది మంది అభ్యర్థులు, వారి కుటుంబ సభ్యులు మానసిక వేదనకు గురవుతున్నారని పేర్కొన్నారు. ప్రతిభ ఆధారంగా ఉద్యోగాలు పొందిన యువత మనోభావాలను దెబ్బతీయడం సరికాదన్నారు. డీఎస్సీ-2025లో ఎంపికైన ఉపాధ్యాయులతో ఎమ్మెల్యే ప్రత్యేకంగా ముఖాముఖి నిర్వహించారు. వారితో కలిసి భోజనం చేస్తూ కుటుంబ నేపథ్యం, పరీక్షలకు చేసిన సన్నాహాలు, ఎంపిక ప్రక్రియ, పరీక్షల నిర్వహణపై అభిప్రాయాలు తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ, డీఎస్సీ పరీక్షలు పూర్తిగా పకడ్బందీగా, పారదర్శకంగా జరిగాయని, తమ ప్రతిభకు తగిన ఫలితం దక్కిందని తెలిపారు. అయితే ప్రస్తుతం వైసీపీ చేస-్తున్న ఆరోపణలు తమకు, తమ కుటుంబ సభ్యులకు మానసికంగా బాధ కలిగిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.వారికి ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ భరోసా కల్పిస్తూ, కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ ప్రతిభకు ప్రాధాన్యత ఇస్తుందని, ఎలాంటి ఆందోళన చెందకుండా విధులు నిర్వహిస్తూ విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపికైన పలువురు ఉపాధ్యాయులు తమ అభి-ప్రాయాలను వెల్లడించారు.

# 9న ప్రపంచ ఆదివాసి దినోత్సవ వేడుకలు
## విజయవంతం చేయాలని పిలుపు

చిత్తూరు,ఆగస్టు 6(అనంత సూర్య): ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని పు-రస్కరించుకుని ఈ నెల 9వ తేదీ (ఆదివారం) ఉదయం 10.30 గంటలకు చిత్తూరు కలెక్టరేట్ ప్రాంగణంలోని డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో ప్రపంచ ఆదివాసి దినోత్సవ వేడుకలను నిర్వహించనున్నట్లు జిల్లా గిరిజన సంక్షేమం మరియు సాధికారిత అధికారి ఆర్. శివప్రసాద్ తెలిపారు.
ఈ కార్యక్రమంలో చిత్తూరు జిల్లాలోని గిరిజనులు, గిరిజన నాయకులు, గిరిజన సంఘాల ప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగులు, ప్రజా సంఘాల సభ్యులు, కార్మికులు, రైతులు, విద్యార్థులు, విద్యార్థినులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రపంచ ఆదివాసి దినోత్సవం సందర్భంగా గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలు, హక్కులు, సంక్షేమం, అభివృద్ధికి సంబంధించిన అంశాలపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారులు తెలిపారు.

# మాదకద్రవ్యాల జోలికి వెళ్లరాదు




## అవగాహన కల్పించిన ఈగల్ టీం

చిత్తూరు,ఆగస్టు 6(అనంత సూర్య): మాదకద్రవ్యాల వినియోగం యువత భవిష్యత్తును నాశనం చేస్తుందని, ఎట్టి పరిస్థితుల్లోనూ వాటి జోలికి వెళ్లరాదని చిత్తూరు 2 టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈగల్ టీం సభ్యులు ప్రజలకు గురువారం అవగాహన కల్పించారు.చిత్తూరు 2 టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వీరభద్ర కాలనీ, గంగినేని చెరువు ప్రాంతాల్లో ఈగల్ టీం సభ్యులు కుమార్, గిరిబాబు ఆధ్వర్యంలో, 2 టౌన్ పోలీస్ స్టేషన్ పోలీసు సిబ్బంది పీసీలు సుబ్రహ్మణ్యం రాజు, నాగరాజు పాల్గొని మాదకద్రవ్యాల నివారణపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ, మాదకద్రవ్యాల వినియోగం ఆరోగ్యాన్ని దెబ్బతీయడంతో పాటు కుటుంబాలు, సమాజంపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతుందని తెలిపారు. ముఖ్యంగా యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి విద్య, ఉపాధి, క్రీడలు వంటి సానుకూల మార్గాల్లో ముందుకు సాగాలని సూచించారు.మాదకద్రవ్యాల విక్రయం, వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని ప్రజలను కోరారు. మాదకద్రవ్యాల నిర్మూలనలో ప్రజల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని, పోలీసులకు సహకరిస్తే సమాజాన్ని మత్తు పదార్థాల రహితంగా తీర్చిదిద్దవచ్చని తెలిపారు. ఈ అవగాహన కార్యక్రమంలో స్థానిక యువత, కాలనీవాసులు, ప్రజలు పాల్గొని మాదకద్రవ్యాల నిర్మూలనకు పోలీసులకు పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

# ఆడి కృత్తిక సందర్భంగా పటిష్ట



## పోలీసు బందోబస్తు

చిత్తూరు,ఆగస్టు 6(అనంత సూర్య): ఆడి కృత్తిక పర్వదినాన్ని పురస్కరించుకుని చిత్తూరు నగరంలోని చామంతిపురం శ్రీ సుబ్రహ్మణ్యస్వామి ఆలయానికి పెద్ద ఎత్తున భక్తులు తరలివస్తున్న నేపథ్యంలో, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు చిత్తూరు సబ్-డివిజన్ డీఎస్పీ జె. వెంకటనారాయణ తెలిపారు. జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఆదేశాల మేరకు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ చిన్న పెద్దయ్య, క్రైమ్ ఇన్‌స్పెక్టర్ ఉమా మహేశ్వరరావు, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నిత్యబాబు ఆధ్వర్యంలో పోలీసు అధికారులు, సిబ్బంది ఆలయ పరిసర ప్రాంతాల్లో భద్రతా ఏర్పాట్లు పటిష్టంగా నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ, భక్తులు ప్రశాంత వాతావరణంలో స్వామివారిని దర్శించుకునేలా అన్ని రకాల చర్యలు చేపట్టామని తెలిపారు. ఆలయ పరిసరాల్లో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడం, వాహనాల పార్కింగ్‌ను నియంత్రించడం, రద్దీ ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడం, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తున్నామని చెప్పారు. భక్తులు పోలీసు సిబ్బందికి సహకరించి ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, వాహనాలను అధికారులు సూచించిన పార్కింగ్ ప్రదేశాల్లోనే నిలిపివేయాలని డీఎస్పీ సూచించారు. ఆడి కృత్తిక ఉత్సవాలు ముగిసే వరకు భక్తుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ పోలీసు బందోబస్తు కొనసాగుతుందని ఆయన తెలిపారు.

# ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్ నిర్మాణానికి భూమి పూజ

పెనుగొండ, ఆగస్టు 06:( అనంత సూర్య): గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి ఇంటికి కుళాయి(ట్యాప్) ద్వారా సురక్షితమైన తాగునీటిని అందించే ఉద్దేశంతో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు జల్ జీవన్ మిషన్ పథకం చేపట్టడం జరిగింది. అందులో భాగంగా సోమందేపల్లి లోని పురాతన పేట వెంకటేశ్వర స్వామి దేవాలయం వెనక భాగాన కూటమి నాయకులు 88.10 లక్షల రూపాయల ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్ నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. ఈ పథకం యొక్క ముఖ్య



లక్ష్యాలు ప్రతి గ్రామీణ కుటుంబానికి వ్యక్తిగత కుళాయి ద్వారా తగినంత తాగునీరు అందించడం, తాగునీటికి తగిన నాణ్యతా ప్రమాణాలతో ఉండేలా చూసేందుకు పరీక్షలు నిర్వహించడం, గ్రామీణ ప్రాంతాల్లోని అన్ని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు సురక్షితమైన నీటి సరఫరా కల్పించడం ఈ పథకం యొక్క ముఖ్య ఉద్దేశం. ఈ సందర్భంగా ఎన్డీయే కూటమి నాయకులు మాట్లాడుతూసోమందేపల్లి పట్టణ ప్రజల త్రాగునీరు కష్టాలను మంత్రి సవితమ్మ తెలపడం, వెంటనే రెండు ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్ లను మంజూరు చేయడం జరిగిందన్నారు.

# డీఎస్సీ అక్రమాలకు లోకేష్ నైతిక బాధ్యత వహించి రాజీనామా చేయాలి... మాజీమంత్రి ఉషశ్రీ చరణ్

పెనుకొండ, ఆగస్టు 06:( అనంత సూర్య): రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం డీఎస్సీ అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించాలని, దానికి బాధ్యత వహిస్తూ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని వైసిపి మాజీ మంత్రిఉషశ్రీ చరణ్ డిమాండ్ చేశారు. పరిగి మండల కేంద్రంలో విద్యార్థి, యువజన విభాగం, వైయ-స్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి రిలే నిరాహార దీక్ష ఆమె చేపట్టారు. డీఎస్సీ నియామకాల ప్రక్రియపై వెలువడుతున్న ఆరోపణలు, పారదర్శకతపై వ్యక్తమవుతున్న



సందేహాలు రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది నిరుద్యోగ యువతలో తీవ్ర ఆందోళన నెలకొల్పాయని పేర్కొన్నారు. ఉద్యోగం కోసం సంవత్సరాల తరబడి కష్టపడి చదివిన అభ్యర్థుల భవిష్యత్తుతో నిర్లక్ష్యంగా వ్యవహరించడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శన మన్నారు.ఎన్నికల సమయంలో ప్రకటించిన నెలకు 3,000 నిరుద్యోగ భృతి హామీని వెంటనే అమలు చేయాలని, విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని, రాష్ట్రంలో ఖాళీగా ఉన్న అన్ని ప్రభుత్వ ఉద్యోగాలను ఎలాంటి అనుమానాలకు తావులేకుండా పారదర్శకంగా భర్తీ చేయాలని ఆమె డిమాండ్ చేశారు.

# మెగా డీఎస్సీలో పలు అక్రమాలకు నైతిక బాధ్యత వహించి రాష్ట్ర మంత్రి లోకేష్ రాజీనామ చెయ్యాలి



అనంతపురం, ఆగస్టు 06:( అనంత సూర్య): డీఎస్సీ అభ్యర్థులకు న్యాయం జరపాలని డిమాండ్ చేస్తూ ఆ పార్టీ అధినాయకత్వం ఇచ్చిన పిలుపుమే-రకు నిరసనలో భాగంగా నేడు స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదురుగా పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమం నిర్వహించారు . ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న వైసిపి జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ ఇటీవల నిర్వహించిన డీఎస్సీలో రాష్ట్ర ప్రభుత్వం పలు అక్రమాలకు పాల్పడిందని దీనివల్ల ఎంతో మంది ప్రతిబ ఉన్న అభ్యర్థుల నష్టపోయారని తెలిపారు. నష్టపోయిన అభ్యర్థులు కోర్టు మెట్లు ఎక్కిన వారికి ఫలితం మాత్రం అందలేదన్నారు. కాబట్టి దీనిపై విచారణకు సిట్ యాలని డిమాండ్ చేశారు లేకుంటే పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఆ నాయకులు కోగటం విజయభాస్కర్ రెడ్డి మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వంలో 1.25 లక్షల సచివాలయ ఉద్యోగాలు భర్తి చే సామని ఏ ఒక్క చిన్న అవకతవకలు కూడా జరగలేదని పేర్కొన్నారు. ముఖ్యంగా స్పోర్ట్స్ కోటాను మూడు శాతం పెంచి పలువురు అనర్హులకు ఉద్యోగాలు ఇచ్చారన్నారు. ఎస్ఎస్ ఏ లో అవుట్సోర్సింగ్ లో పనిచేస్తున్న పలువురు అభ్యర్థులు ఎస్ జి టి బీడీ లేకపోయినా టెట్టులో పాస్ కాకపోయినా వారికి కూడా టీచర్ల ఉద్యోగాలు లభించాయని ఆరోపించారు. ఈ వ్యవహారంలో పెద్ద ఎత్తున ముడుపులు చేతులు మారాయని ఆరోపించారు. జడ్పీ చైర్మన్ గిరిజమ్మ మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలో నిరుద్యోగ భృతి ఇస్తామని రెండేళ్లు గడిచినా కూడా వాటి సంగతి గురించి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆలోచించుకోవడం నిరుద్యోగులను నిండా ముంచాడు అన్నారు. ఆ లెక్కన తీసుకుంటే ప్రతి నిరుద్యోగికి ఒక్కొక్కరికి ఒక లక్ష ఎనిమిది వేలు బాకీ పడినట్టు ఈ మొత్తాన్ని వెంటనే చెల్లించాలని ఆమె డిమాండ్ చేశారు. జాబ్ క్యాలెండర్ ఊ సే లేదన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభమై మూడు నెలలు దాటిన ఇంతవరకు ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేయకపోవడం తీవ్ర విచారకరమన్నారు. ఇప్పటికే తమ కోర్సులు పూర్తి ఐ సర్టిఫికెట్ల కోసం కాలేజీ యాజమాన్యం అడగ్గా తమకు ఇంతవరకు ప్రభుత్వం నుంచి ఫీజు రీయింబర్స్ పడలేదని తమ బకాయిలు ఎవరు చెల్లిస్తారని సర్టిఫికెట్లు ఇవ్వకుండా విద్యార్థులను ఇబ్బందులుకు గురిచేస్తుంది. ఫ ఫీజు రీయింబర్స్ మొత్తం దాదాపు 6. 8 కోట్లు బకాయిలు ఉన్నాయని తెలిపారు. విద్యార్థుల ఇబ్బందులు దృష్టిలో ఉంచుకొని ఫీజు రీయంబర్స్మెంట్ మొత్తాన్ని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అవినీతి దౌర్జన్యం అక్రమాలు రాజ్యమేలుతున్నాయని ఆ పార్టీ నాయకులు తెలిపారు. ట్రేడ్ యూనియన్ అధ్యక్షులు ఓబిరెడ్డి మాట్లాడుతూ డి ఎస్ అభ్యర్థుల స్పోర్ట్స్ కోటాలో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయని ఆరోపించారు. కేంద్రంలో నీట్ వ్యవహారంలో విద్యార్థులకు జరిగిన అ న్యాయం లో నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామ చేశారని అదేవిధంగా డిఎస్సి లో జరిగిన అక్రమాలకు నైతిక బాధ్యత వహిస్తూ లోకేష్ నాయుడు వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. డీఎస్సీ అభ్యర్థులకు న్యాయం చేసే విధంగా సిట్ యాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ మాజీ మేయర్ వసీం తో పాటు పలువురు ఆ పార్టీ నాయకులు, సిపిఐ నాయకులు జగదీష్,లింగమయ్య తదితరులు పాల్గొన్నారు.

# అన్నా క్యాంటీన్లు, తాగునీరు, పారిశుద్ధ్య సేవలపై జిల్లా కలెక్టర్ సుదీర్ఘ సమీక్ష - జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

పుట్టపర్తి ఆగస్టు 06:( అనంత సూర్య): ఘన వ్యర్థాల నిర్వహణ సంబంధించి పలు మౌలిక సదుపాయాలు, ప్రజా సేవల పురోగతిపై మునిసిపల్ అధికారులతో జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలోని అన్ని అన్నా క్యాంటీన్లలో ఆహార నాణ్యత, పరిశుభ్రతపై ప్రజల నుండి 85% పైగా సానుకూల స్పందన రావడం పట్ల కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు.మడకశిర (100%), హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రి (100%) స్థానాల్లో ఉత్తమ సేవలు అందుతుండగా, పుట్టపర్తి,ఏనుములపల్లి లో పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. సిబ్బంది ప్రవర్తన మరియు నిర్ణీత వేళలకు క్యాంటీన్లు తెరవడంపై ఏకాగ్రత చూపాలని స్పష్టం చేశారు.పట్టణ



ప్రాంతాల్లో తాగునీటి సరఫరా నాణ్యత సగటున 66.72% ఉందన్నారు. ధర్మవరం (77.78%) లో మెరుగ్గా ఉన్నప్పటికీ, మడకశిర (35%), పుట్టపర్తి, హిందూపురం ప్రాంతాల్లో నీటి నాణ్యత, సరఫరా వేళలపై వస్తున్న ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని మునిసిపల్ ఇంజనీర్లను ఆదేశించారు.పబ్లిక్ హెల్త్ వర్కర్లు ప్రతిరోజూ ఇళ్ల నుండి చెత్తను సేకరించే ప్రక్రియ జిల్లాలో 62% సానుకూలంగా ఉంది. హిందూపూర్ (67.87%), పెనుకొండ (61.25%) ప్రాంతాల్లో మెరుగ్గా పనిచేస్తుండగా, మిగిలిన ప్రాంతాల్లో వంద శాతం సాధించాలని పేర్కొన్నారు.పరిసరాల్లో చెత్త కుప్పలను 24 గంటల్లోపు తొలగించడం మరియు మురికికాల్వల పూడికతీత పనులను మరింత వేగవంతం చేయాలని స్పష్టం చేశారు.జిల్లాలోని ప్రధాన వీధులు, కాలనీలలో వీధిదీపాల నిర్వహణపై కొన్ని ప్రాంతాలలో (సాయినగర్, జండవేపమాను, కుటగుళ్ళ మొదలైనవి) ప్రతికూల స్పందన ఎక్కువ ఉందన్నారు.వెలగని వీధి దీపాలను గుర్తించి, తక్షణమే కొత్త బల్బులు లేదా రాజుణ లు అమర్చి సమస్యను 24-48 గంటల్లో పరిష్కరించాలని విద్యుత్ సచివాలయ సిబ్బందికి ఆదేశించారు.

# ఐఆర్ఏడి యాప్ పై డివిజన్ పోలీసులకు శిక్షణ తరగతులు డి.ఎస్.పి. బీవీ.జగన్నాథరాజు

ధర్మవరం: ఆగస్టు 06 (అనంత సూర్య): ఐ ఆర్ ఏ డి యాప్ పై డివిజన్లోని



పోలీసులకు శిక్షణ తరగతులను ధర్మవరం డిఎస్పి. బివి జగన్నాథరాజు ఆధ్వర్యంలో వన్టౌన్ పోలీస్ స్టేషన్లో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ధర్మవరం డివిజన్లోని 10 పోలీస్ స్టేషన్లో ఐ ఆర్ ఏ డియాప్పు అమలు చేయాలని తెలిపారు. రోడ్డు ప్రమాదాలు సంభవించినప్పుడు ఏ విధంగా ఈ యాప్ ను ఉపయోగించాలన్న విషయాన్ని అడ్మిన్ సోమలా నాయక్ వివరించారని తెలిపారు. ప్రమాదాలు జరిగినప్పుడు ప్రతి పోలీస్ స్టేషన్లో మొత్తము వివరాలను నమోదు చేసి ప్రమాద బాధితులకు ప్రభుత్వం ద్వారా అందించే సహాయాలను వారు అందించేలా కృషి చేయాలని తెలిపారు. ప్రమాదాలపై వచ్చే ఇన్సూరెన్స్ వచ్చే అవకాశం పై క్లైమ్ కూడా చేయాలని తెలిపారు. తప్పనిసరిగా ప్రతి పోలీస్ స్టేషన్లో ఈ యాప్ అమలు అయ్యేలా సిఐలు, ఎస్సైలు కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవె-న్యూ డివిజన్ పరిధిలోని సిఐలు , ఎస్సైలు, పోలీస్ స్టేషన్లోని కంప్యూటర్ ఆపరేటర్లు తదితరులు పాల్గొన్నారు..

# గాండ్లపెంట తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన జిల్లా జాయింట్ కలెక్టర్ ఎమ్. మౌర్య భరద్వాజ్



గాండ్లపెంట ,ఆగస్టు 06:( అనంత సూర్య): గాండ్లపెంట మండల తహసీల్దార్ కార్యాలయాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎమ్. మౌర్య భరద్వాజ్ గారు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.కార్యాలయ ప్రాంగణాన్ని, వివిధ విభాగాల రికార్డులను ఆయన నిశితంగా పరిశీలించారు. భూ సమస్యలు, పట్టాదార్ పాస్ పుస్తకాలు, మ్యుటేషన్ అప్లికేషన్లు, మరియు ఇతర రెవెన్యూ సేవల పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించారు.పిజిఆర్ఎస్ కార్యక్రమం ద్వారా వచ్చిన అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా, నిర్దేశిత గడువులోగా నాణ్యతతో పరిష్కరించాలని ఆదేశించారు.కార్యాలయ సిబ్బంది హాజరు రిజిస్టర్‌ను పరిశీలించి, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.ప్రజల నుంచి వచ్చే దరఖాస్తులకు అనవసర విలంబన లేకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించి సేవలు అందించాలని అధికారులను సూచించారు. "ప్రభుత్వ సేవలు ప్రతి ఒక్క పౌరుడికి సులభంగా, పారదర్శకంగా అందడమే ధ్యేయం. ప్రజల సమస్యల పరిష్కారంలో రెవెన్యూ అధికారులు అంకితభావంతో పనిచేయాలి."
ఈ కార్యక్రమంలో కదిరి ఆర్డీఓ కలావతి, తహసీల్దార్ నరసింహులు, డిప్యూటీ తహసీల్దార్, ఆర్ఐ, సర్వేయర్లు మరియు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# గ్రామదేవతగా పూజలందుకుంటున్న రాయలవారి శాసనం..

## విజయనగర కాలం నాటి ద్విభాషా శాసనం కావచ్చన్న చరిత్రకారుడు మైనాస్వామి..

పెనుకొండ,ఆగస్టు 06:( అనంత సూర్య) : గ్రామదేవతగా భక్తుల పూజలు అందుకుంటున్న రాతిపలక.కానీ అది సాధారణ శిల కాదు తరతరాలుగా గ్రామస్తులు చరిత్రను తెలియకుండానే సంరక్షిస్తూ వస్తున్న ఈ శాసనం, ఇప్పుడు చారిత్రక పరిశోధనలకు కొత్త దారులు చూపుతోంది. గోరంట్ల మండలం నార్సింపల్లి పంచాయతీ ఎర్రబల్లి గ్రామంలో గ్రామదేవత బొడ్డెమ్మ గా పూజలందుకుంటున్న



రాతిపలక, విజయనగర సామ్రాజ్య చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయల కాలానికి చెందిన అరుదైన శాసనం కావచ్చని చరిత్రకారుడు మైనాస్వామి తెలిపారు. గురువారం గోరంట్లలో మైనా స్వామి విలేకరులతో మాట్లాడుతూ గ్రామ-స్తుల ఆహ్వానం మేరకు ఎర్రపల్లి గ్రామాన్ని సందర్శించి అక్కడ గ్రామ మధ్యలో నిలబెట్టిన శిలా శాసనాన్ని పరిశీలించినట్లు తెలిపారు. సాధారణంగా బొడ్డెమ్మకు ఎలాంటి రూపం లేదా విగ్రహం ఉండదని, చిన్న గుండ్రటి రాయిని ప్రతిష్ఠించి గ్రామదేవతగా పూజించడం ఆనవాయితీ అని వివరించారు. అయితే శాసనం చెక్కిన రాతిపలకనే గ్రామదేవతగా పూజించడం అత్యంత అరుదైన విషయమని పేర్కొన్నారు. పరిశీలనలో శాసనం పైభాగంలో తెలుగు, కింది భాగంలో సంస్కృత భాషలో అక్షరాలు చెక్కబడినట్లు గుర్తించినట్లు తెలిపారు. శాసనం పైభాగంలో సూర్యుడు, చంద్రుడు, త్రిశూల చిహ్నాలు స్పష్టంగా కనిపిస్తున్నప్పటికీ, కాలగమనంలో వాతావరణ ప్రభావంతో అక్షరాలు చాలా వరకు చెదిరిపోయాయని చెప్పారు.శాసన నిర్మాణ శైలి, దానిపై ఉన్న చిహ్నాల ఆధారంగా ఇది విజయనగర కాలానికి చెందిన ద్విభాషా దాన శాసనం అయి ఉండే అవకాశముందని మైనాస్వామి అభిప్రాయపడ్డారు. దేవాలయానికి, సమూహానికి లేదా స్థానిక నాయకుడికి ఇచ్చిన దానానికి సంబంధించిన శాసనం కావచ్చని అంచనా వేశారు. ప్రాచీన చరిత్రను తెలియకుండానే తమ ఆధ్యాత్మిక జీవితంలో భాగంగా చేసుకుని, తరతరాలుగా ఈ శాసనాన్ని సంరక్షిస్తూ వస్తున్న గ్రామ పెద్దలు, ప్రజలను ఆయన అభినందించారు. ఈ క్షేత్ర పరిశీలనలో గ్రామ పెద్దలు వెంకటరెడ్డి, సోమశేఖర రెడ్డి, సురేంద్ర రెడ్డి తదితరులు పాల్గొని, శాసనంపై మరింత శాస్త్రీయ పరిశోధన జరగాలని కోరారు.

# జిల్లాలో ఎరువులకు కొరత లేదు – జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ



నందిగామ, ఆగస్టు 06, అనంత సూర్య ప్రతినిధి: కుక్కల బాబు : నందిగామ పట్టణంలోని శ్రీ మణికంఠ సీడ్స్ అండ్ ఫెర్టిలైజర్స్ దుకాణాన్ని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ గురువారం ఆకస్మికంగా సందర్శించి ఎరువుల పంపిణీ ప్రక్రియను క్షేత్ర–స్థాయిలో పరిశీలించారు. రైతులకు పారదర్శకంగా ఎరువులు అందుతున్నాయా, ప్రభుత్వ నిబంధనలు పాటిస్తున్నారా అనే అంశాలపై స్వయంగా తనిఖీ నిర్వహించారు. దుకాణంలో రైతులకు అవసరమైన హెల్ప్‌లైన్ నంబర్లు, ఎరువుల ధరల పట్టికలు స్పష్టంగా ప్రదర్శించారా లేదా అని పరిశీలించారు. అలాగే ఎరువులు కొనుగోలు చేస్తున్న రైతులు సంబంధిత పంట నమోదును పూర్తి చేసుకున్నారా అనే విషయాన్ని కూడా పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు ఏపీఏఐఎంఎస్ యాప్ ద్వారా కేటాయించిన ఎరువుల వివరాలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. రైతుకు ఉన్న సాగుభూమి విస్తీర్ణం, పంట నమోదు, అర్హత మేరకు యూరియా, డీఏపీ వంటి ఎరువుల కేటాయింపు, ఇప్పటికే పొందిన పరిమాణం, ఇంకా పొందాల్సిన నిల్వ తదితర వివరాలను యాప్‌లో పరిశీలిస్తూ అధికారులకు అవసరమైన సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ మాట్లాడుతూ జిల్లాలో ఎరువుల కొరత లేదని స్పష్టం చేశారు. ఎవరూ ఎరువుల కోసం క్యూ లైన్లలో నిలబడాల్సిన అవసరం లేదన్నారు. ఏపీఏఐఎంఎస్ యాప్‌లో నమోదు చేసుకున్న ప్రతి రైతు తన అర్హత మేరకు ఎప్పుడైనా ఎరువులు పొందవచ్చని తెలిపారు. ప్రతి రైతుకు ప్రభుత్వం కేటాయించిన ఎరువుల కోటా ఆయా రైతులకే కేటాయింపుగా ఉంటుందని, ఒకేసారి తీసుకోవాల్సిన అవసరం లేదని, అవసరమైన సమయంలో తమ కోటా మేరకు ఎరువులు పొందవచ్చని వివరించారు. రైతులు అవసరానికి మించి రసాయన ఎరువులు వినియోగించరాదని జిల్లా కలెక్టర్ సూచించారు. అధిక ఎరువుల వినియోగం వల్ల పంటలు, భూసారం, పర్యావరణం, అలాగే ఆహారాన్ని వినియోగించే ప్రజల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం ఉంటుందని చెప్పారు. శాస్త్రీయ ప్రమాణాల ప్రకారం ఒక ఎకరాకు అవసరమైన పరిమాణంలో మాత్రమే ఎరువులు వినియోగించాలని రైతులకు సూచించారు. పచ్చిరొట్ట పంటలు సాగు చేయడం ద్వారా భూసారం పెరిగి, రసాయన ఎరువుల వినియోగాన్ని గణనీయంగా తగ్గించుకోవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు. అలాగే పంట మార్పిడి విధానాన్ని పాటించడం ద్వారా భూమి సారవంతంగా ఉండటంతో పాటు రైతులకు స్థిరమైన ఆదాయం లభిస్తుందని తెలిపారు. దేశవ్యాప్తంగా ఏలినినో ప్రభావం ఉన్న నేపథ్యంలో రైతులు నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని ఆరుతడి పంటల సాగుపై దృష్టి పెట్టాలని సూచించారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల ఎంపిక చేసుకోవడం ద్వారా నష్టాలను నివారించడంతో పాటు లాభదాయకమైన వ్యవసాయం చేయవచ్చన్నారు. రాఘవాపురంలో సేంద్రియ వ్యవసాయ క్షేత్రాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ అనంతరం రాఘవాపురం గ్రామంలో సేంద్రియ పద్ధతిలో సాగు చేస్తున్న పంట పొలాలను జిల్లా కలెక్టర్ సందర్శించి రైతులతో నేరుగా మాట్లాడారు. పంటల దిగుబడి, సాగు విధానాలు, మార్కెట్ అవకాశాలపై వివరాలు తెలుసుకున్నారు. రైతులు బ్యాంకుల ద్వారా పంట రుణాలు తీసుకున్నారా అనే విషయంపై కూడా ఆరా తీశారు. రసాయన ఎరువులు, పురుగు మందులు వినియోగించకుండా పండించిన కూరగాయలు, ఆహార ఉత్పత్తులు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని జిల్లా కలెక్టర్ తెలిపారు. సేంద్రియ పద్ధతిలో పండించిన కూరగాయలు రుచికరంగా ఉండటంతో పాటు పోషక విలువలు కూడా అధికంగా ఉంటాయని పేర్కొన్నారు. సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు ప్రజలు రైతులు పండించిన సేంద్రియ ఉత్పత్తులను కొనుగోలు చేయాలని విజ్ఞప్తి చేశారు. రైతులు కూడా ప్రతి ఏడాది సేంద్రియ సాగు విస్తీర్ణాన్ని పెంచుతూ ప్రకృతి వ్యవసాయానికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఈ పర్యటనలో నందిగామ ఆర్డీవో ఎ.అనిల్ కుమార్, తహసీల్దార్ నూతక్కి సురేష్ బాబు, ఎంపీడీవో వరప్రసాద్, ఏపీవో శరత్ బాబు, రెవెన్యూ సిబ్బంది, వ్యవసాయ విస్తరణ అధికారులు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు. జిల్లా సమాచార శాఖ, విజయవాడ నుండి జారీచేయడమైనది.

# ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసిన తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు

అమరావతి ఆగస్టు 06, అనంత సూర్య ప్రతినిధి కుక్కల బాబు: తిరువూరు నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా ఆ నియోజకవర్గ గౌరవ శా–సనసభ్యులు శ్రీ కొలికపూడి శ్రీనివాసరావు గురువారం అమరావతి సచివాలయంలోని ముఖ్యమంత్రి ఛాంబర్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గౌరవ ముఖ్యమంత్రివర్యులు శ్రీ నారా చంద్రబాబు నాయుడు ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గానికి అవసరమైన నిధులను అధికంగా కేటాయించాలని కోరుతూ ముఖ్యమంత్రికి ఆయన ప్రత్యేక వినతిపత్రాన్ని అందజేశారు. నియోజకవర్గ వ్యాప్తంగా చేపట్టాల్సిన పలు అభివృద్ధి పనులపై సీఎంతో సమగ్రంగా చర్చించారు. పలు సమస్యలపై ముఖ్యమంత్రికి వివరణ: తిరువూరు నియోజకవర్గంలోని ఆర్అండ్‌బి రోడ్ల నిర్మాణం, సీసీ రోడ్లు, కల్వర్టులు, వంతెనల నిర్మాణం, తాగునీటి సదుపాయాలు మరియు ఇతర మౌలిక వసతుల కల్పనతో పాటు ప్రజలకు సంబంధించిన పలు పెండింగ్ పనులను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. వీటన్నింటికీ తగిన నిధులను త్వరితగతిన మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి: శాసనసభ్యులు కొలికపూడి శ్రీనివాసరావు సమర్పించిన వినతిపత్రాన్ని పరిశీలించిన సీఎం శ్రీ నారా చంద్రబాబు నాయుడు ఎంతో సానుకూలంగా స్పందించారు. తిరువూరు నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం అందిస్తామని, ప్రతిపాదించిన అభివృద్ధి పనులకు వీలైనంత త్వరగా నిధులను మంజూరు చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు. మంత్రులతో భేటీ – అభివృద్ధి పనులపై సమీక్ష: ముఖ్యమంత్రితో భేటీ అనంతరం, అమరావతి సచివాలయంలోని పలు శాఖల మంత్రులను కూడా ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు మర్యాదపూర్వకంగా కలిశారు. తిరువూరు నియోజకవర్గానికి సంబంధించిన వివిధ శాఖల సమస్యలు, ప్రతిపాదనలు మరియు



పెండింగ్‌లో ఉన్న పనులపై వారితో చర్చించి, వాటిని వేగవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు మాట్లాడుతూ... తిరువూరు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించడమే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రభుత్వం నుంచి అత్యధిక నిధులు సాధించి, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తానని ఆయన స్పష్టం చేశారు.

# వైఎస్ జగన్ భద్రత గాలికొదిలేస్తున్న కూటమి సర్కార్



న్యూఢిల్లీ ఆగస్టు 06, అనంత సూర్య ప్రతినిధి: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి భద్రతను కల్పించడంలో రాష్ట్రంలో కూటమి సర్కార్ పదే పదే విఫలమవుతోందని పార్టీ ఎంపీలు ఇవాళ కేంద్ర హోంమంత్రి అమిత్ షా కి ఫిర్యాదు చేశారు. అలాగే రాష్ట్రంలో నిర్వహించిన డీఎస్సీ అక్రమాల పుట్టగా నిర్ధారణ అయినా చర్యలు తీసుకోవడం లేదని, అలాగే శాంతిభద్రతల పరిస్థితి రోజురోజుకూ దిగజారుతోందని అమిత్ దృష్టికి వారు తీసుకెళ్లారు. ఈ మూడు అంశాలపై తక్షణం జోక్యం చేసుకోవాలని హోంమంత్రి అమిత్ షాను వైఎస్సార్‌సీపీ ఎంపీలు కోరారు.

1.వైఎస్ జగన్మోహన్ రెడ్డి భద్రతలో వైఫల్యాలు : కేంద్రానికి పదేపదే విజ్ఞప్తి చేసినప్పటికీ, మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డికి రాష్ట్ర ప్రభుత్వం తగినంత భద్రత కల్పించడంలో విఫలమవడంపై పార్టీ ఎంపీలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. నిన్న జగన్ మోహన్ రెడ్డి దేవరపల్లి పర్యటన సందర్భంగా లక్షలాది మంది ప్రజలు గుమిగూడినప్పటికీ, పోలీసుల మోహరింపు చాలా తక్కువగా ఉందని, ఇది తీవ్రమైన భద్రతా ముప్పును కలిగిస్తోందని వారు హోంమంత్రికి తెలిపారు. గత రెండేళ్లుగా రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి నిర్వహిస్తున్న అన్ని బహిరంగ పర్యటనలలో ఇదే వైఫల్యం కొనసాగుతోందని, కూటమి ప్రభుత్వం దురుద్దేశంతోనే ఇలా వ్యవహరిస్తోందని వారు ఆరోపించారు. దీనిపై స్పందించిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా .. సానుకూలంగా స్పందించి, తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. 2.డీఎస్సీ నియామకాలలో అవకతవకలు కూటమి ప్రభుత్వం నిర్వహించిన డీఎస్సీ నియామక ప్రక్రియలో భారీ ఎత్తున అవకతవకలు జరిగాయని, ముఖ్యంగా స్పోర్ట్స్ కోటాను దుర్వినియోగం చేశారని వైఎస్సార్‌సీపీ ఎంపీలు ప్రస్తావించారు. అవినీతి, అవకతవకల కారణంగా అర్హులైన అభ్యర్థులు ఉద్యోగాలు కోల్పోతున్నారని, దీనివల్ల నిరుద్యోగ యువత, విద్యార్థులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారని వారు పేర్కొన్నారు. కాబట్టి డీఎస్సీ నియామక ప్రక్రియపై నిష్పక్షపాతంగా, న్యాయబద్ధంగా విచారణ జరిపేలా ఆదేశాలు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు.

3.క్షీణిస్తున్న శాంతిభద్రతలు రాష్ట్రంలో వైఎస్సా–ర్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, మద్దతుదారులను అక్రమ నిర్బంధాలు, రాజకీయ ప్రేరేపిత కేసుల ద్వారా లక్ష్యంగా చేసుకోవడానికి కూటమి ప్రభుత్వం పోలీసు యంత్రాంగాన్ని దుర్వినియోగం చేస్తోందని వైఎస్సార్‌సీపీ ఎంపీలు ఆరోపించారు. మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు, మాజీ ఎమ్మెల్యే విరూపాక్షి అరెస్టులను వారు ఉదాహరణగా పేర్కొన్నారు. గత రెండు నెలల్లో లాకప్‌లలో నలుగురు మరణించినట్లు వచ్చిన వార్తలపై వారు ఆందోళన వ్యక్తం చేశారు. జవాబుదారీతనం, ప్రజాస్వామ్య హక్కుల్ని పరిరక్షించాలని డిమాండ్ చేశారు. అధికార పార్టీ మద్దతుదారులు, ఎమ్మెల్యేలు రోడ్లను దిగ్బంధించి, భారతీ సిమెంట్స్ కార్యకలాపాలకు ఆటంకం కలిగిస్తూ దానిని ఉద్దేశపూర్వకంగా లక్ష్యంగా చేసుకుంటున్నారని కూడా ఎంపీలు ఆరోపించారు. గతంలో అల్ట్రా టెక్ విషయంలో కూడా ఇదే జరిగిందని, ఇది ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడిదారుల విశ్వాసాన్ని దెబ్బతీస్తోందని వైఎస్సార్‌సీపీ ఎంపీలు తెలిపారు. ఈ సమస్యలను కేంద్ర ప్రభుత్వం తక్షణమే పరిగణనలోకి తీసుకుని, ఆంధ్రప్రదేశ్‌లో ప్రజాస్వామ్య విలువలు, ప్రజా భద్రత, చట్టబద్ధమైన పాలన, నిష్పక్షపాత పెట్టుబడి వాతావరణం ఉండేలా చూడాలని వైఎస్సార్‌సీపీ ఎంపీలు కోరారు.

# సమస్యల పరిష్కార నాణ్యతను మెరుగుపరచాలి
## జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్





అనంత కలెక్టరేట్ ఆగస్టు 06 ( అనంత సూర్య): తహసీల్దార్ కార్యాలయం ద్వారా అర్జీల సమస్యల పరిష్కారంలో నాణ్యతను మరింత మెరుగుపరచాలని జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్ ఆదేశించారు. గురువారం ఆత్మకూరు తహసీల్దార్ కార్యాలయాన్ని జాయింట్ కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ పీజీఆర్ఎస్ ఫైళ్లు, మ్యుటేషన్ ఫైళ్లు మరియు ఎఫ్ లైన్ పిటిషన్లను పరిశీలించి, ఎప్పటికప్పుడు పెండింగ్ లేకుండా దరఖాస్తులను పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అనంతపురం ఆర్డీఓ ప్రేమంతకుమార్, తహసీల్దార్, తదితరులు పాల్గొన్నారు. పి.యలేరు గ్రామంలో రీసర్వే పనులను తనిఖీ చేసిన జాయింట్ కలెక్టర్ . అంతకు ముందు ఆత్మకూరు మండలం పి.యలేరు గ్రామంలో రీసర్వే పనులను జాయింట్ కలెక్టర్ తనిఖీ చేసి క్షేత్రస్థాయిలో గ్రౌండ్ ట్రూ థింగ్ పనులను పరిశీలన చేశారు. గ్రౌండ్ ట్రూ థింగ్ పనులను సకాలంలో పూర్తి చేయాలని అధికారులను జెసి ఆదేశించారు.

# ఈ నెల 7న పెనుగంచిప్రోలులో ప్రత్యేక గ్రీవెన్స్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



ఎన్టీఆర్ జిల్లా ఆగస్టు 06, అనంత సూర్య ప్రతినిధి కుక్కల బాబు : ఈ నెల 7వ తేదీ శుక్రవారం జగ్గయ్యపేట నియోజకవర్గ స్థాయిలో ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం జరుగుతుందని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమం పెనుగంచిప్రోలులోని ఆర్కే ఫంక్షన్ హాల్ లో జరుగుతుందన్నారు. ఈ ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమంలో జగ్గయ్యపేట నియోజకవర్గ పరిధిలోని స్థానిక ప్రజల నుంచి అధికారులు అర్జీలను ఉదయం 10 గంటల నుంచి స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లాస్థాయి అధికారులు పాల్గొంటారని ప్రజల సమస్యలకు సంబంధించిన అర్జీలను స్వీకరించి పరిష్కార చర్యలు చేపడతారని పేర్కొన్నారు. జగ్గయ్యపేట నియోజకవర్గ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ లక్ష్మీశ కోరారు. (సమాచార, పౌర సంబంధాల శాఖ, ఎన్టీఆర్ జిల్లా ద్వారా జారీ)

# కట్టా వెంకటేశ్వర్లు గారికి పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఘన నివాళి



ఖమ్మం జిల్లా ఆగస్టు 06, అనంత సూర్య ప్రతినిధి: కుక్కల బాబు : మధిర నియోజకవర్గం, చింతకాని మండలం పొద్దుటూరు గ్రామానికి చెందిన మహాజన సోషలిస్ట్ పార్టీ సీనియర్ నాయకులు శ్రీ కట్టా వెంకటేశ్వర్లు ఎరుకుల గారు గుండెపోటుతో అకస్మాత్తుగా కన్నుమూయడం పట్ల ఉద్యమ లోకం తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. గత మూడు దశాబ్దాలుగా మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి పోరాటంలో క్రియాశీలకంగా వ్యవహరిస్తూ, ఉద్యమ బలోపేతానికి ఆయన విశేష కృషి చేశారు. ఆయన మరణం ప్రజా ఉద్యమాలకు తీరని లోటని నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎంఆర్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు, పద్మశ్రీ మందకృష్ణ మాదిగ గారు పొద్దుటూరు చేరుకుని, వెంకటేశ్వర్లు గారి పార్థివదేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం స్వయంగా పాడె మోసి తన నివాళిని అర్పించారు. శోకసంద్రంలో ఉన్న వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ఉద్యమం వారికి ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. అశ్రు నయనాల మధ్య సాగిన ఈ అంతిమయాత్రలో ఎంఆర్పీఎస్, ఎమ్ఎస్పీ ముఖ్య నాయకులు, ఉద్యమ కార్యకర్తలు, అభిమానులు మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని వీడ్కోలు పలికారు. కట్టా వెంకటేశ్వర్లు గారి ఆత్మకు శాంతి కలగాలని, వారి కుటుంబానికి ఈ తీరని లోటును తట్టుకునే ధైర్యాన్ని భగవంతుడు ప్రసాదించాలని పలువురు ప్రార్థించారు.

Editor, Published and Owned by C Hari Krishna, Published from D.no 1-3-780, Rajaka Nagar, Anantapur - 515001, Printed from NALIVELI EXPRESS PRINTERS Hno. 1-1A9T-10, Main Road, Pattikonda, Kurnool 518380, EDITOR : C HARI KRISHNA" Mobile number: 9182495405